ఆ అంగళ్ళన్నీ పెద్ద మసీదుకేసి జరిగి పోయినాయి. లేవు లేవిప్పుడు మునుపటి చోటను అవి. చుట్టూ మందుల దుకాణా లున్నాయి యిప్పుడు. ఆ చలివేంద్ర స్థలమన్నది అక్రమ ఆక్రమణగా తేలి వుంది నేడు. ఎక్కడా కనపడ్డమే లేదు. మా వూళ్లో, నేనన్న చింతా కొట్టేశారు. ఈ దరిమిలాను, చింత కొట్టిన వంతను కొంగలూ వ్రాలడం చాలించు కొన్నాయి. ఎక్కడ వ్రాలడం అవి? వేలకు వేలు వ్రాలి ఆహ్లాదం గొలిపేవి అవి మున్ను. ఇప్పుడు వచ్చినీ్న ఎక్కడ వ్రాలడం అవి?

అవి నిజంగా ఒక్కొక్కప్పుడు యోజిస్తే నాకు రాణ్మహేంద్రవరము నడిబజారునుండి, మా యూరి నడివీధి వరకూ సమస్తం శూన్యాకాశంగా కనిపిస్తుంది.

...."తెల్లవారను గడుసరి గొల్లవారు" ఈ రోజున వై దొలగినా! అఖండ భారతవర్షం భిన్నాభిన్నమైనా ఏర్పడే శూన్యాకాశం మాట? "కటా! ఏమిటా?" అని అనిపిస్తుంది.

....

కిసిమిసి పండగ సరదా

"కిసిమిసి" పండగసరదాలు డిశంబరు 25వ తేదీని ప్రారంభం! కాదు—డిశంబరు 24 సాయంత్రమే కొంచెం కొంచెంగా సంధ్యారాగంతో ప్రారంభిస్తే ప్రారంభించొచ్చు. మఱి 24 తెల్లవాఱగట్ల నగర సంకీర్తనం, ఉదయం గుడిలో ప్రార్థన, ప్రతియింటా "కిసిమిసి" వృక్షస్థాపన—వీటితో కిసిమిసి పండగ భూమికి దిగింది పూర్తిగా దిగింది అని అనుకోవాలి. ఏదైనా—25 వ

తేదీ సాయంకాలం జరిగే నృత్యగీత వినోదాల్తో కిసిమిసిపండగ వచ్చేసింది అని అనకతప్పదు. "కారు"లు మీదవెళ్ళే దొరలూ దొరసానులూ కార్లమీద వెళ్ళుతూవుంటారు. కారులమీద వచ్చే దొరలూ దొరసానులా కార్లమీద వస్తూవుంటారు. సైకిళ్ళమీద పోయే ఏంగ్లోఇండియన్ పిల్లకాయలు సైకిళ్ళమీద కనిపిస్తారు. కాలినడకను నడిచే దేశవాళీ క్రిష్టియన్ జనం కాలినడకను వెడుతూవుంటారు.

ఆలా పండగ సర్దాకొద్దీ వస్తూపోతూవుండే జనసమూహాన్ని తిలకిస్తూవుంటే ప్రాముఖ్యంగా ముస్తాబు చూపిస్తూ దృష్టి నాకర్షించేవాళ్ళు భాగ్యవంతులకంటె బీదవాళ్ళే ఎక్కువ. ఏజాతి పండగలోవుండే తత్వంకూడా అదే ఏమో. సర్వసాధారణంగా నిత్యకృత్యంలోనయితం భాగ్యవంతులు ముస్తాబుకావడం రివాజు కాబట్టి భాగ్యవంతులయొక్క షోకు పండగ వాళ్ళల్లో పెద్ద యిదిగా వన్నెకెక్కదు. కాని బీదవాళ్ళ రూపురేఖలో—గబుక్కున అమావాస్యవెళ్ళిన మర్నాటి రాత్రే పవర్ణమి వచ్చేసినట్టూ, ఒక్కమాటుగా నిండు చందురు డుదయించినట్టూ కనబడతాయి—పండగనాడు హఠాత్తుగా, నవ్వుతూ కలకల్లాడుతూ, పరాసికాలాడుకుంటూ, పెద్దపెద్ద చీరల్తో, కొత్తకొత్తబొత్తాముల్తో పట్టు వోణీల్తో—చూస్తురా! పండగ అంతా తమరికోసమే అన్నట్టు ఉప్పొంగిపోతూవుంటారు వాళ్ళు. క్రితంరేత్రి పస్తున్నా గాని పబ్బంనాడు పరమాన్నం వండుకొని "ఏజన్మలో పస్తున్నాం? ఏ జన్మలోనూ పస్తుండలేదు" అని అనుకొనేటంత నిశ్చింతగా మసుల్తారు.

ఈనుండి నేను వ్రాయబోయే కథ పూర్వోక్త తత్వానికి గొప్ప తార్కాణం.

"రెబెక్కా" మిక్కిలి నల్లటి పిల్ల! నల్లందనమనే ఛాయ అందాన్ని చూపిస్తుందా అనాకారితనాన్ని చూపిస్తుందా అనే వితర్కింపున కిది చోటుగాదు. ఓ పిల్లనుచూచి ఆలా వితర్కించడం సబబూకాదు. పిల్లయొక్క కళ్లు తెలికళ్ళయి, చూస్తూవున్నంతలో, పిల్లయొక్క పళ్లు కుదురుక్కుదురై, అదురుకు అదురై, నడుస్తూవున్నంతలో, పిల్ల నల్లటి పిల్లయితేం? ఎట్టిటి పిల్లయితేం? శరీరచ్ఛాయ అనేది ఇంతకూ లోపలి యూహల్నిబట్టి మారుతూవుంటుంది. ఎదర చూచువాడు మగవాడై. మగవాడైయుండడమే కాకుండా చూడబడే సొగసుకత్తెను, ప్రేమించినవాడై, ఎప్పుడు కనబడుతుందా తన ప్రియురాలు, ఎప్పుడు పలుకరిద్దామాఅనే యువ్విళ్ళూటతో వేచియున్న కాముకుడైయుంటే, పిల్లకురులు తుమ్మెదసరులు, పిల్లలవాటం, నెలవంకవాటం, పిల్లముక్కు సంపెంగ మొక్క పిల్ల పెదవి అమృతపుంజవి—వాడే ఆ పిల్ల తన కక్కర్లేని వాడైతే—ఆ పిల్లలోచూచేవి అన్నీ వంకరలే—ఒక్కమాటలో చెప్పమంటే "బాగాలేదు. అబ్బేఛా" అంటాడు.

రెబెక్కాను ప్రేమించినవాడు మోసెస్. మోసెస్సును గుఱించి వ్రాయవలసి వచ్చినా అంతే. మగాడికి అట్టూ ఆడదానికి పిట్టూనా? మోసెస్ రెబెక్కా కంటిలో కనుపాపైనా డేనాడో!

డిశంబరు 24 మధ్యాహ్నంనుంచీ రెబెక్కాయొక్క సంకల్పం. అతివేగంగా మోసెస్‌ను 25వ తేదీని కలుసుకుందామని "నీకు మంచి కిసిమిసిపండగ" అని చెబుదామనీ సంకల్పం. కాని మోసెస్ బహూ బీదవాడు. మతం పుచ్చుకున్నా

దన్న మాటేగాని చెప్పులు కుట్టుకునేవృత్తి మానలేకపోయి నాడు. చిన్నప్పుడు మాదిగకులంలో పుట్టినవాడులాగుంది. ఇఖ ఆకులం అంటే హిందూసంఘంలో అట్టడుగుకులం. ఆకులవృత్తి తానుమాని పైకిరావాలంటే చాలా ఆధ్యాత్మికశక్తి చాలా ఆర్థిక శక్తికూడా వుండాలి వాడికి. ఒక్క క్రిష్టియన్ మతం పుచ్చు కున్నమాత్రాన్ని రానేరదు. రెబెక్కా గ్రుడ్డిలో మెల్లఅన్నట్టు కాస్తనయం. ఆమె తల్లి ఓ దొరగారియింట "ఆయా" గా వుండి దొరగారిపిల్లల్ని త్రోపుడు బళ్ళమీద త్రిప్పుతూవుండేది. ఆమెకు ఆ రోడుల్లో పుట్టింది రెబెక్కా రెబెక్కా క్రమంగా పెరిగి మిషన్‌బళ్లో చదువుకుంటూవచ్చింది. చదువుకుంటూవున్నా పెద్దచదువు చదువుతూండలే. నాలుగోతరగతిలోకి వచ్చింది పదహారోయేట. ఏం చదువుతూవున్నా మిషన్ బళ్లో చదువు కుంటూవున్న క్రిష్టియన్ అమ్మాయి కాబట్టి తెల్లని మల్లిపూవు లాంటి కోక, అలాంటిదే కబ్బా, వంటిని ధరించి, తప్పకుండా ఓ పువ్వు తల్లో తుఱిమి చూపఱకు వేకువనే ఎదురొచ్చినా మంచి శకునమే అనిపించింది.

ఇక్కడ పాఠకునకు ఒకసందేహం తోచవచ్చును. అసలు రెబెక్కాకు మోసెస్సుకు అటువంటిపరిస్థితిలో ఎలా స్నేహం కలిసిందా అని.

ఆ సందేహం తీరాలీఅంటే ఓ ఇతిహాసం తెలుసుకోవలసి వుంటుంది.

అది ఏమిటీ అంటే పూర్వం ఒక ప్రాయంపు రాజ కుమార్డు పచారుచేస్తూ తన ప్రాసాదో పరితలాన్నుంచి క్రింది వీధికేసి పరికిస్తూవున్నాట్ట. ఆ సమయానికే వీధిలో ముంగిలి

తుడుస్తూవుంటట ఒక్కత్తె—యౌవనంలోవున్న కార్మిక స్త్రీ వెంటనే ఆ కార్మిక స్త్రీని రాజకుమార్తు తన మేడమీదకు పిలి పించాట్ట పిలిపించి "నీవు నా రాణివి" అన్నాట్ట. కార్మిక స్త్రీ కొంచెంజంకి "స్వామీ! మీరు మహారాజులు" అందిట తన తొడలచాయ కనబడకుండా కొంచెం దిగదోసుకుని. "అయితే" అన్నాట్ట యువరాజు మీసం మెలిపెట్టుకుంటూ "మీరు మీసాటి భాగ్యవంతుల్ని వివాహ మాడవలసింది" అందిట, దానికి అత గాడన్నాట్ట. "సమానభాగ్యం ఓ యిద్దర్ని దంపతులుగా చేసే టప్పుడు "సమానవయస్సు ఎందుకు చేయకూడదు? అని అడిగాట్ట. కార్మిక స్త్రీ అడిగిందట అప్పుడు "ఈ ప్రేమ ఇలా వుంటుందా?" అని "ఎందుకువుండదూ?" అన్నాట్ట. కుమార రాజులుంగారు. అయితే తన గుడిసెకు రమ్మందిట కార్మిక స్త్రీ. యువరాజు వెంటనే ఆలోచనలో బడ్డాట్ట. "ఏం? ప్రభువులు ఆలోచిస్తున్నారు?" అందిట ఆమె. యువరాజు "ఈలా మనం నిలుచునియుండగా ఈ సౌధం కూలిపోతే ఎంతబాగుండి పోయాదో—అని యోజిస్తూ వున్నాను, నేను ఈ సౌధందిగి నీ గుడిసెకు చేరేటంత కాలహరణం "ఓర్వగలనా? ఓర్వ గలనా?" అన్నాట్ట. అలా అంటూ యువరాజు మూర్ఛపోయి నాట్ట. కార్మిక స్త్రీ మేడమెట్లు దిగిపోయి తనతోడి కార్మికుల్ని పిల్చి తక్షణం ఆ సౌధాన్ని పడగొట్టి తన గుడిసెతో సరిసమా నంగా చేయవలసింది" అందిట. తోడి కార్మికులంతా "మూర్ఛ పోయిన యువరాజు తాముకూలగొట్టేగోడల్లో కప్పబడిపోతా డేమో" అన్నారట. ఆమె వెంటనే "ఇదిగో నా చేతుల్లోకి అతడు పడేటట్టు చేసుకొంటాను అతనికి దెబ్బతగల్నివ్వను"

అందిట చేతు లిలా ఎత్తి—అక్కడికే ఇతిహాసంలో మనక్కా వలసిన భాగం—

కథ క్కాళ్ళేమిటి అన్న సామెతగా ప్రేమకూడా కాళ్ళు ఒక్కొక్కప్పు డగుపించవు? అంతేగా ఇతిహాసంలోని సత్యం? మన కథలోని సత్యం అంతే.

మోసెస్సుకు క్రిష్టమస్ బహుమానాలు ఇచ్చేదొరలుగాని దొరసానులుగాని ఎవరూలేరు. అంచేత 25 వ తేదీ సాయంత్రం ఎక్కడికీ వెళ్ళకుండా "రెబెక్కా అలా వెడుతుంది గదా ఆమె చూపుకే తన కానుక" అన్నట్టు, ఓ మలుపులో ఓ జంతికలమ్మే అరుగుమీద వృత్తినే కూర్చున్నట్టు కూర్చున్నాడు.

రెబెక్కాకు ఆ సంగతి తెలియదు. 25 వ తేదీని ఏలాగో ఓలాగు మోసెస్సును చూడాలనేగాని ఎక్కడ? ఎప్పుడు? అనే చింతన చేసుకొని సంకేతించుకోడానికి తీఱికలేక పోయింది. ప్రొద్దున్న ఛర్చికివెళ్ళింది మధ్యాహ్నం తన బడి దొరసానమ్మ గారు బహుమానాలిస్తారు అంటే దొరసానమ్మగారి యింటికి వెళ్ళింది. ఆ రెండుపనులతోటే కిసిమిసిరోజు ఇరవై నాలుగు గంటలూ నిండిపోయినట్టుగా తోచిపోయింది.

ఏ మలుపు దగ్గఱ మోసెస్సు కాచికొనివున్నాడో ఆమలుపు మళ్ళుతూవుంది రెబెక్కా, తనకు దొరసానమ్మగారిచ్చిన బహుమతిపటం వక్షానికి హత్తుకుంటూ మోసెస్సు చటాల్న అరుగు దిగి ఆమెను వెంటాడిస్తూ "రెబెక్కా" అన్నాడు. రెబెక్కా వెనక్కుతిరిగి చూచిందై "ఇక్కడున్నావా?" అంది. "ఏదీ నీ బహుమానం?" అన్నాడు, దగ్గఱగా వెళ్ళి. ఆమె తన చేతుల్లోనే ఆలాపట్టుకుంది పటం తాను కూడా చూస్తూ—

మోసెస్సుకు పటం కావాలా?

పటం చాటుచేసి రెబెక్కాకు ఒక్కముద్దిచ్చాడు. రెబెక్కా "ఇందుక్కాదు పటమిస్తా దొరసానమ్మగారు" అంటూ తన బుగ్గ తుడుచుకుంది. మోసెస్సు అన్నాడు "నీకు మంచి కిసిమిసి" అని. రెబెక్కా "చాల్లే నడీదిలో" అంది.

మోసెస్సు అన్నాడు "రెబెక్కా! నా ప్రియమైన రెబెక్కా! యేసుపటం గోడనువున్నప్పుడు యేసు తాను ప్రజల యెడ చూపించిన ప్రేమను మనకు చాటుతూవుంటాడు. యేసు పటం మనచేతుల్లోవున్నప్పుడు మనల్ని మనయొక్క యేప్రేమ అయితే గలదో ఆయొక్క ప్రేమను లోకానికి చూపమంటాడు" అని. రెబెక్కా అంది "యేసు మనచేతుల్లో పటంగా గాక, గోడమీద పటంగా గాక, మనహృదయంలో భావంగా వుంటే?" అని. మోసెస్సు "మనం మన ప్రేమను లోకానికి తెలియకుండా మనలో మన యిద్దఱికే తెలిసేటట్టు అనుభవించాలి" అన్నాడు.

రెబెక్కా నవ్వింది. నేడు మహా మంచి కిసిమిసి అయిందోయి నీ ప్రసంగంవల్ల" అని. రెబెక్కా సంపుల్ల పుండరీక పుష్పంలా విఱగబడి నవ్వింది!

....

ఎట్టిటి మట్టిపళ్లు - ఎట్టి టోపీలు

ఒకానొక దేశనాయకుడు వస్తాడనిచెప్పి, పోలీసుదళాన్ని, 50 గజాల కొక్కొక్కడిగా, నిలబెట్టి, రోడ్డంతా కాపలాకాయమన్నారు. జనం ఎవరూ ఆ మధ్యను నడువకూడదు. ఎవరూ మాట్లాడకూడదు నాయకునకే ఆదారి, ఆ తదంగము అదంతా?